# " ఓంకారి " మాయాస్వరూపము

ఉప్పు సత్యాగ్రహ సమరమప్పుడు "ఓంకారి" పదునెనిమిదేండ్ల పడుచు పిల్ల. బ్రాహ్మణ బాల వితంతువు. తలవెండ్రుకలు తీయించుకోని ఎలనాగ. ఆమెకు మగడు పోయినది అయిదవయేటనే కావడంవల్ల పదునెనిమిదవ యేడు పైబడేసరికి, ఆ విచారము అడుగంటిపోయి, చిగిరించిన చింతమోకలా చెలువం గొల్పు సాగింది.

భర్తగల నారి భర్తకు సేవచేస్తే, భర్త పోయిన నారి భారతదేశానికి సేవచేయాలి అన్న గొప్ప ప్రతినబూని, తిన్నగా ఉప్పుసేత మహోద్యమంలో నడుంకట్టి వీరనాయకి అయింది. జాతీయ జెండా చేతపట్టింది. లాటీ దెబ్బలు కాసుకుంది. పోటీ అన్నది మఱచిపోయి, కులం అన్న పట్టింపు విడిచిపెట్టి, భారత దేశము యొక్క సంపూర్ణ స్వాతంత్ర్యమే పరమావధి అని తలపోసి, ప్రచండమైన త్యాగమును యోగమును జూపించింది. ఆమె పరోక్షమందు ఆమెకొఱకు విరహమనుభవించిన యువకు లెల్లఱు ఆమె సమక్షమందు విరాగులు అయిపోయేవారు. ఆమె కళ్ళల్లోని నిదానమట్టిది !

క్రమశః భగవంతుని కృపవలన భారతదేశమునకు 1947 ఆగస్టు 15 వ తేదీని స్వాతంత్ర్యం లభించింది. యావద్భారత దేశము అశోకచక్ర పతాక క్రింద శాంతి పీఠము చూచి ముగ్ధ మైంది. " ఓంకారి " ముక్తకంఠియై గొప్ప జాతీయగీతం పాడింది. ఆమె పాటనే పీఠమువంక జూచునంత, పీఠముపైని స్వరాజ్య లక్ష్మి ఆసీనయై ప్రేక్షక లోకమునకు గనువిందువు గావించింది.

పాట ఆపినంతలో మాయమైంది. శూన్యపీఠం మాత్రమే వుంది "అంత చంచలయోగమా స్వరాజ్యభోగము ?" అని అందరూ అనుకొనుచుండ "ఓంకారి" ముందునకు వచ్చి "మీరీ అంత ర్ధానమునకు వగవకుడు. అది తిరిగి మనకు వేరొకచో లభించు. కాని యీ పర్యాయము ఉప్పునేతవల్లను, ఖైదులో బరువు మోత వల్లను రానేరదు. సర్వమానవ సౌభ్రాతృత్వం వల్లనే రాగలదు. ముఖ్యముగా స్త్రీజనాభ్యుదయము, హరిజనాభ్యుదయము, జాన పదాభ్యుదయము అవసరములు" అని ప్రబోధించెను. "పట్న వాసములన్నియు పల్లెలు కావలెను" అని మూడవ సూత్రము ప్రతిపాదించెను.

మొదటి రెండు సూత్రములును అందఱకు అర్థమైనవి కాని మూడవ సూత్రము అర్థమైనది కాదు. ప్రతీ పల్లెటూరు ఒక "న్యూయార్కు" నగరంలా తయారుకావలెను అని చెప్పవలసిన తరుణంలో ఈ తగనిమాట ఈమె నోటినుండి ఏల వచ్చెనే అని వగచిరి. ఆమెను తండోపతండములుగా ప్రజలు చుట్టుముట్టి ప్రశ్నించ సాగిరి.

ఆమె నిరుత్తరమై ఊరకేకను గొలంకులనుండి భాష్ప మోడ్చుట తక్క మరొక్క ప్రత్యుత్తర మీయదాయె. బాష్పము నకు బాష్పమునకు మధ్యవచ్చు ఎగువులో "నాయొక్క! నేను చిన్నప్పుడు నా పల్లెటూరిలో నాటిన మొలక! ఇప్పుడు వృక్షమై యుంటుంది! అవిగో! దాని పూవులు, అవిగో వాని పరిమళం!" అని పరవశమై "అక్క డిప్పుడొక ఆకాశాన్నొఅనే మేడ కడితిమా ఆ చెట్టు ఏమియగును?" అని బారుమని, "నన్నై నను దాని నీడకు గొంపొండు! మీ రందరూ రాకపోయిననూ

నే నొంటిగా దాని క్రింద వాసముచేయగలను " అని ఆమె తన పల్లెకు వెడలిపోయెను. ఆ చెట్టు ఆమె చిన్ననాడు పదవయేట పాతినచెట్టు ఇరవైయో యేటగాని ఆమెకు జ్ఞాపకము రాలేదు. ఆ రావడము భారతదేశ స్వతంత్ర దేవతాగమనంలో వచ్చింది. మఱి ప్రజాసేవనుండి ప్రకృతిసేవ జేయజొచ్చింది " ఓంకారి ".

చెట్టుక్రింద మరెవ్వరూ కనబడేవారు కారు. కాని చెట్టుమీద ఒక పిట్ట కోకిలకంటె వినసొంపుగా కూస్తూ వుండేది. చూస్తే అది నెమలికంటె కనసొంపుగా వుండేది. అడిగితే " భరత " పక్షికంటె ఎక్కువ నేర్పుగా శకునాలు చెప్పేది. దానికేదో కొత్త పేరు పెట్టాలని " భారత పక్షీ " అన్నారు అంతాను.

ఒకనాడా పక్షిని ప్రజలంతా గుమిగూడి ప్రశ్న అడిగితే, " ఆ చెట్టు మొదటను బంగారు గని వుంది " అని చెప్పింది ఆ శిఖండి. " అయ్యో ! పిట్టా నీ బ్రదుకు నీ వెరుగకుండా జవాబు చెప్పేవే ! " అని ఓంకారి విలపించింది.

ప్రజలంతా ఓంకారిని స్వార్థపరాయణురాలని, బంగారు పాతు సంగతి తెలిసే ఆ చెట్టును పీనాసిలా కనిపెట్టుకువుందని నానాదుర్భాషలూ ఆడి, చెట్టుక్రిందనుండి ఆమె నీవలకు ఈడ్చి, చెట్టును కుంకుటి వేళ్ళకంటా తవ్వి పారేశారు.

ప్రజలకు బంగారం కనిపించలేదుగాని, చెట్టు చచ్చిపోయింది. పిట్ట ఎగిరిపోయింది కాని, అది పోతూ పోతూ చెట్టున కాచిన ఒకే ఒక్క పండూ ముక్కున కఱచిపెట్టుకుని మరీ ఎగిరిపోయింది.